క్లుప్తంగా

కమిషనర్ దృష్టికి 12వ వార్డు సమస్యలు



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి వినతిపత్రం అందజేశారు. వార్డులో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని, డ్రైనేజీ, తదితర సమస్యలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు.

వేసవిలో కంటి జాగ్రత్తలు పాటించాలి

ఆరిలోవ: వేసవిలో కంటి ఆరోగ్యంపై జాగ్రత లు తీసుకోవాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు అల్లు హిమబిందు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవిలో ఎక్కువగా కళ్ల కలకలు, ఎలర్జీ, పొడి కళ్లు, కంటి ఇన్‌ఫెక్షన్లు సోకుతాయన్నారు. సూర్యుడి నుంచి వచ్చే తీవ్రమైన వేడికి గాలిలోని అధిక స్థాయి కాలుష్య కారకాలు ఉంటాయన్నారు. అవి కళ్లలో ఇన్‌ఫెక్షన్, ఎరుపుదల, దురద కలిగిస్తాయన్నా రు. ఈ వేడి వల్ల కంటిలో ఉండే కన్నీటి పొర వేగంగా ఆవిరైపోతుందన్నారు. దీనివల్ల కళ్ల మంటలు వస్తాయన్నారు. పొడికళ్లు ఉన్నవారు మరింత ఇబ్బందిపడతారని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సూర్య రశ్మికి ఎదురుగా వెళ్లొద్దని సూచించారు. సూర్యుడి నుంచి వెలువడే యూవీ కిరణాలకు అడ్డుపడే చలువ కళ్లద్దాలను వినియోగించాలన్నారు. దురద పుట్టినప్పుడు కంటిని తరచూ చేతితో నలపకుండా వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు.

బీజేపీ నగర ఉపాధ్యక్షురాలిగా గిరిజ



గిరిజకు ఉత్తర్వులు అందిస్తున్న రవీంద్ర

ఎంవీపీ కాలనీ: బీజేపీ విశాఖ నగర ఉపాధ్యక్షురాలిగా తాలాడ గిరిజ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు శుక్రవారం పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం గిరిజ మహిళా మోర్చా సీనియర్ నాయకురాలుగా, విజయనగరం జిల్లా ఇన్‌చార్జిగా ఉన్నారు. పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆమె వెల్లడించారు.

ఎంవీపీ కాలనీకి టీటీడీ కల్యాణ రథం



విశాఖ చేరుకున్న శ్రీవారి కల్యాణ రథం

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ రథం శుక్రవారం రాత్రి ఎంవీపీ కాలనీ చేరుకుంది. సీతంపేటలోని నూతన ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా తిరుమల నుంచి ఈ కల్యాణ రథం విశాఖ వచ్చింది. రాత్రి 9 గంటల తరువాత ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపానికి చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు భక్తులు అక్కడకు వెళ్లి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిబ్బందికి మహా ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గ్రంధి రాజేష్, హిమాంశు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎరీనా.. అడుగడుగునా ఆహ్లాదం

- వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనాకు సందర్శకుల తాకిడి
- వేసవి కారణంగా పెరుగుతున్న వాకర్స్ సంఖ్య
- సాయంత్రం వేళ ఆహ్లాదంగా గడుపుతున్న పిల్లలు, పెద్దలు



హెల్త్ ఎరీనాలో వాకింగ్ చేస్తున్న యువత



ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరుతున్న పిల్లలు, పెద్దలు

ఎంవీపీ కాలనీ: కైలాసగిరి కొండను ఆనుకొని నిర్మించిన వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనా అడుగడుగునా ఆహ్లాదం పంచుతోంది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో రోజూ సాయంత్రం పార్కుకు వెళ్లి పొద్దిపోయే వరకు ఆహ్లాదకర వాతావరణంలో గడుపుతున్నారు. 12 సెక్టార్లలో విస్తరించి ఉన్న ఎంవీపీ కాలనీతో పాటు ఇతర ప్రాంతాల వాసులు ఉదయం నడక, సైక్లింగ్ కోసం ఈ ఎరీనాను వుడా(ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ) 8 ఏళ్ల క్రితం అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే నడక, సైక్లింగ్ కోసం ఏర్పాటు చేసిన ఈ ఎరీనాకు పెరుగుతున్న ప్రజల ఆదరణకు అనుగుణంగా అనేక సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం యోగా, మెడిటేషన్ వంటి సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

2014 నుంచి సేవలు..

వుడా పార్కులు, ఉదయం నడక మార్గాల అభివృద్ధిలో భాగంగా హెల్త్ ఎరీనాను అందుబాటులోకి తేవాలని భావించింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దేందుకు 2009లో పనులు ప్రారంభించారు. కైలాసగిరి కొండ చుట్టూ కొంత భాగాన్ని చదును చేసి నడక మార్గాన్ని అభివృద్ధి చేశారు. 3.7 కిలోమీటర్ల పొడవున ఈ నడక మార్గాన్ని అభివృద్ధి చేశారు. దాదాపు రూ.7 కోట్ల వ్యయంతో నడక, సైక్లింగ్ మార్గాలను తీర్చిదిద్దారు. దీంతో పాటు నగరంలోనే అతిపెద్ద బుద్ధ విగ్రహంతో బుద్ధవనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అయితే నిర్మాణ పనులు సుదీర్ఘ కాలం కొనసాగగా.. 2014లో ఈ హెల్త్ ఎరీనా సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం 5 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు హెల్త్ ఎరీనా ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు.

సేదతీరుతున్న ఎంవీపీ కాలనీ

3.7 కిలోమీటర్ల మేర విస్తరించిన హెల్త్ ఎరీనాతో ఎక్కువగా ఎంవీపీ కాలనీ వాసులు వినియోగించుకుంటున్నారు. ఉద్యానవనాలు, పూల మొక్కలు వాకర్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొండను



బుద్ధవనం వద్ద మహిళల మాటామంతి

ఆనుకొని ఈ వాకింగ్ ట్రాక్ నిర్మించడంతో స్వచ్ఛమైన గాలితో పాటు పచ్చదనంతో ఉదయం, సాయంత్ర వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. దీంతో ఎండల వేడి నుంచి ఉపసమనం పొందేందుకు పిల్లలు, పెద్దలు పెద్ద ఎత్తున ఎరీనాను ఆశ్రయిస్తున్నారు. దీంతో పాటు పలువురు పార్కులో ఉన్న వ్యాయామ ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎరీనా పొడవునా సుందరీకరణ కోసం పదుల సంఖ్యలో కార్మికులు సేవలందిస్తున్నారు. పచ్చదనం పెంపుతో పాటు పరిశుభ్రతకు విశేష కృషి చేస్తున్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరాలు



ఎన్‌ఎస్‌ఎస్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, సుధీర్ చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణ, మత్తు మందులు, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించామన్నారు. 16వ వార్డులో రెల్లివీధి, అంబేడ్కర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యార్థిలో సామాజిక స్పృహ, సేవా తత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పని చేసినట్టు వివరించారు. అంబేడ్కర్ సేవా సంఘం కార్యదర్శి కె.నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవా భావం పెంపొందించడానికి ఇటువంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ అధికారులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు రత్నభారతి, సామ్యూల్ డేవిడ్‌రాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గాజులతో చిన పోలమాంబ అలంకరణ



గాజుల అలంకరణలో చిన పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో చిన పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం గాజుల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేపట్టింది.

అదుపులోకి మంటలు



శుక్రవారం మధ్యాహ్నం మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- 19 గంటల పాటు 5 అగ్నిమాపక శకటాల సేవలు
- పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు
- పొగ కారణంగా సాయంత్రం వరకు లోపలికి వెళ్లలేని పరిస్థితి



వస్త్ర దుకాణంలో కమ్మేసిన పొగ

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో యువరాణి వస్త్ర దుకాణంలో చెలరేగిన మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. గురువారం రాత్రి 11 గంటగలకు మంటల్ని గుర్తించిన స్థానికులు గోపాలపట్నం పోలీసులకు 11.05 గంటలకు సమాచారమందించారు. ఆ తరువాత అగ్నిమాపక సిబ్బందికి 11.15 గంటలకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన అధికారులు 11.30 గంటలకు మంటల్ని అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు శుక్రవారం సాయంత్రం వరకు కూడా కొనసాగాయి. పూర్తిగా మంటలు అదుపులోకి వచ్చినా పొగ మాత్రం వస్తూనే ఉంది. పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో కోట్ల నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మూడు అంతస్తుల్లో ఉన్న వస్త్రాలు, ఫర్నిచర్ విలువైన పరికరాలు అన్ని కాలిబూడిదయ్యాయి. వస్త్ర దుకాణం ఉద్యోగి ఎన్.రామ్మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గోపాలపట్నం సీఐ ఈదుల నరసింహారావు కేసు నమోదు చేశారు. అగ్నిమాపక అధికారులు కూడా ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల లేక మరే ఇతర కారణాల వల్ల జరిగిందో ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పూర్తి స్థాయిలో మంటలు అదుపులోకి రాకపోవడంతో నష్టాన్ని అంచనా వేయలేకపోతున్నామని తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ సురేష్‌కుమార్, వీఆర్‌వో సుబ్రహ్మణ్యం, సచివాలయం కార్యదర్శులు ఉన్నారు. సుమారు 19 గంటల పాటు నగరంలోని ఐదు అగ్నిమాపక శకటాలతో సిబ్బంది నిరంతరాయంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఏడీఎఫ్‌వో సుబ్బారావు స్వయంగా మంటలు ఆర్పే చర్యలను పర్యవేక్షించారు.

పిఠాపురం కాలనీలో ట్యాంకర్‌తో నీటి సరఫరా



పిఠాపురం కాలనీలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం : గోదావరి పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలిగింది. ఈ మేరకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా పలు ప్రాంతాలలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెంలలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆశీనులను చేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో శాస్త్రోక్తంగా కల్యాణంనిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం లక్ష రూపాయల విరాళాన్ని నగరంలోని లలితానగర్‌కి చెందిన వారణాసి ప్రమీల శ్రీనివాస్ అనే దాత అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై మే ఐహెల్ప్ యు కేంద్రంలో పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు నాయుడు బాండ్ అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి కృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ
- నగరంలో విస్తృత పర్యటన



అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

బీచ్ రోడ్డు: నగరంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిరిపురం, బాలాజీ నగర్, ఏయూ పరిసర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్లాప్ వాహనాలు వెళ్లేందుకు వీలు లేని ఇరుకు సందుల్లో పుష్ కార్ట్‌ల ద్వారా చెత్తను సేకరిస్తున్నారని చెప్పారు. ఆ చెత్తను కింద వేసి మళ్లీ లిఫ్ట్ చేయడం వల్ల అధిక శ్రమతో పాటు సమయం వృథా అవుతుందన్నారు. అలా కాకుండా నేరుగా చెత్త తరలించే వాహనానికి అందించాలని కమిషనర్ సూచించారు. రోడ్ల శుభ్రత సరిగ్గా ఉండడం లేదని, ఎక్కడ వ్యర్థాలు అక్కడే ఉన్నాయని కమిషనర్ మండిపడ్డారు. కాలువలను కూడా శుభ్రం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చెత్తతో నిండిపోయిన డెస్ట్‌బిన్లను ప్రతి రోజు తొలగించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి విశాఖలోని ఐటీ సెజ్‌కు వస్తున్నందున ఆ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపుల, మధ్య భాగంలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్



ప్రజలకు పథకాల కోసం వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కరమాని విజయనిర్మల తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ 28వ వార్డు పరిధి ఊటగడ్డ, నెహ్రూ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల కోసం వివరించారు. సీఎం జగన్ నిరుపేదల కుటుంబాల్లో ఆనందాలే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

జీఎస్టీ కమిషనర్‌కు ఏయూ డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి, కస్టమ్స్, జీఎస్టీ శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వరరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. న్యాయ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య దాసరి సూర్య ప్రకాశరావు పర్యవేక్షణలో ×విదేశీ మారక ద్రవ్యం –చట్ట విరుద్ధమైన డబ్బుతో విదేశీ బ్యాంకుల లావాదేవీలు, తీసుకోవలసిన చట్టాలు, మార్గదర్శక సూత్రాలు, అవగాహన×అంశంపై జరిపిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను వెంకటేశ్వరరావు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

పరిశోధక విద్యార్థికి రిజిస్ట్రార్ అభినందన



సురేష్‌మీనన్‌ని అభినందిస్తున్న రిజిస్ట్రార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పీడీఎఫ్ స్కాలర్ డాక్టర్ ఎం.సురేష్ మీనన్‌ను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అభినందించారు. ఇటీవల ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో సురేష్ మీనన్ పరిశోధన పత్రం సమర్పించారు. ఆన్‌లైన్ విద్య ప్రాధాన్యత తెలియజేస్తూ, గ్రామీణ ప్రాంతాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఈ పరిశోధన పత్రంలో వివరించారు. ఈ సందర్భంగా మీనన్‌ని రిజిస్ట్రార్ కృష్ణమోహన్, జర్నలిజం విభాగ ఆచార్యులు డి.వి.ఆర్.మూర్తి అభినందించారు.

అనకాపల్లి బీసీ గర్జన విజయవంతానికి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గా నరేష్ తదితరులు

ఎంవీపీ కాలనీ: అనకాపల్లి వేదికగా శనివారం జరగనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి బోను దుర్గా నరేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఎంవీపీ కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హలో బీసీ చలో అనకాపల్లి పేరుతో బీసీ గర్జన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, బీసీ సంఘం అధికార ప్రతినిధి అనచంద్ర ప్రసాద్, బీసీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు శరత్ కుమార్, అయ్యప్ప, గణేష్ పాల్గొన్నారు.

పక్కి దివాకర్ కుటుంబానికి పరామర్శ



పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కోలా గురువులు

కంచరపాలెం: ఇటీవల మరణించిన రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పక్కి దివాకర్ కుటుంబ సభ్యులను మర్రిపాలెంలోని స్వగృహంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు పరామర్శించారు. దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, బీసీ అధ్యయన కమిటీకి దివాకర్ చేసిన సేవలను గుర్తు చేశారు. అందరితో కలిసికట్టుగా ఉంటూ అనేక సేవలందించిన దివాకర్‌ను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోటాన రాము, రామన్న పాత్రుడు, సత్యాల సాగరిక, సత్యాల వెంకట్, అప్పారావు, బొండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

గోపాలపట్నం: జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల, కళాశాలల పరిధి 9, 10 తరగతులు, ఇంటర్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎన్‌ఎస్టీఎల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. మే నెల 9, 10 తేదీల్లో ఉత్పత్తులు, మల్టీమీడియా ప్రదర్శన ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టయినబుల్ ఫ్యూచర్ అనే అంశంపై నమూనాల పోటీ జరుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రదర్శించనున్న నమూనాల వివరాలను ఆయా స్కూళ్లు, కాలేజీల ప్రిన్సిపాళ్లు మే 3లోగా సంస్థకు పంపించాలని సూచించారు. వివరాలకు 94902 32433, 93963 67120, 85390 88872 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన నమూనాలను 9, 10 తేదీల్లో జరిగే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామని అధికారులు తెలిపారు.

ఘనంగా మౌంట్ డియోస్ స్కూల్ కల్చరల్ ఫెస్ట్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

దొండపర్తి : మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ కాన్వొకేషన్, కల్చరల్ ఫెస్ట్–2023 పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్‌కు అకడమిక్ కోఆర్డినేటర్ వరలక్ష్మి నేతృత్వం వహించగా ముఖ్య అతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు. ముందుగా అధ్యాపకుల ఆధ్వర్యంలో బృందం ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూనియర్ సెకండరీ విద్యార్థిని శర్వాణి నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించింది. అనంతరం పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై వారి ప్రతిభను ప్రదర్శించారు. సంగీతం, పాటలు, డ్యాన్స్‌లతో అందరినీ ఉర్రూతలూగించారు. చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విద్య వందన సమర్పణ చేశారు.

‘తాగునీటి సమస్యను పరిష్కరించాలి’

మద్దిలపాలెం : గోదావరి పైపులైన్ మరమ్మతుల కారణంగా తలెత్తిన తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. జోన్- 3 పరిధిలో చినవాల్తేరు, పెదవాల్తేరు, పాండురంగాపురం, రేసపువానిపాలెం, పిఠాపురంకాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాయకనగర్, మంగాపురంకాలనీ, జాలరిపేట, ఆదర్శనగర్, వాసవువానిపాలెం, ఎంవీపీ సెక్టార్ 1 నుంచి 12 వరకూ, సింహాద్రిపురం, నక్కవానిపాలెం, పాత వెంకోజీపాలెం, దుర్గానగర్, ఇసుకతోట ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. శనివారం ఇదే పరిస్థితి తలెత్తితే ట్యాంకర్ల ద్వారా అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేయాలని ఆయన కోరారు.